క్లుప్తంగా

రేపు వీరాంజనేయ స్వామి ఉత్సవాలు



ఖాజీపేట : మండలంలోని తవ్వారిపల్లె గ్రామంలో వెలసిన వీరాంజనేయ స్వామి వారి 7వ వార్షికోత్సవ ఉత్సవాలను ఈ నెల 14 నుంచి అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 14న ఉదయం పంచామృతాభిషేకంతో ఉత్సవాలు మొదలవుతాయి. సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవం జరుగుతుంది. అలాగే సేద్యపు ఎద్దులతో బండలాగుడు పోటీల పందెం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సావాల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

నేడు వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి కావ్య మాధురి తెలిపారు. గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం వద్ద ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థి చక్రపాణిని అభినందిస్తున్న ఎస్టీయూ నాయకులు

పోరుమామిళ్ల : జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో జాతీయస్థాయిలో ర్యాంకు సాధించిన విద్యార్థిని బుధవారం ఎస్టీయూ నాయకులు అభినందించారు. ఎస్టీయూ జిల్లా కార్యదర్శి వెంకటరామయ్య కుమారుడు వెంకట చక్రపాణి జాతీయస్థాయిలో 8,814 ర్యాంక్, ఓబీసీ కేటగిరిలో 1,916 ర్యాంక్ సాధించాడు. చక్రపాణి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థిని అభినందించిన వారిలో బాలరాజు, చంద్రశేఖర్, రాజగోపాల్, ఆనంద్, వెంకటసుబ్బయ్య, పుల్లయ్య, రమణయ్య, గురుమూర్తి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.


యాత్రికులపై ఉగ్రవాదుల చర్య అమానుషం



డీఆర్వోకు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ప్రతినిధులు

కడప కల్చరల్: జమ్ము కశ్మీర్‌లోని వైష్ణోదేవి ఆలయం నుంచి శివ్‌ఖోడికి వెళ్తున్న హిందూ భక్తుల బస్సుపై ఇస్లామిక్ జిహాదీ ఉగ్రవాదుల దాడి అమానుషమని వీహెచ్‌పీ ప్రాంత ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ బెస్తవేముల రామ మహేష్, జిల్లా సహ కార్యదర్శి చిక్కన్న అన్నారు. ఉగ్ర దాడిలో పది మంది ప్రాణాలు కోల్పోయినందున, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఆర్వోకు వారు వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ ఆర్టికల్ 370ని తొలగించాక ప్రశాంత వాతావరణం ఏర్పడిందని, ఉగ్రవాదుల దుడుకు చర్యలు మాత్రం తగ్గలేదన్నారు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసే సమయంలో ఈ సంఘటన దేశ సార్వభౌమాధికారానికి సవాలుగా నిలుస్తోందన్నారు. ఇలాంటి అంశాలను ప్రోత్సహించే అంతర్గత విదేశీ సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి మనోహర్‌రెడ్డి, సహ కార్యదర్శి సురేంద్ర, భజరంగ్‌దళ్ సహ సంయోజక్ అమర్, హిందూ పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీసెట్‌లో ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్ : జేఎన్‌టీయూ విడుదల చేసిన ఏపీఈఏపీ ఫలితాల్లో కడప నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంజినీరింగ్ అండ్ అగ్రికల్చర్, ఫార్మసీ పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటారు. బ్రింద 438వ ర్యాంకు, హాసిని 536, సుస్మిత 598, సారా ఖానమ్ 679, హితేష్‌రెడ్డి 868వ ర్యాంకులను సాధించారు. డీజీఎం రామ్మోహన్ రెడ్డి, కోర్ డీన్ చంద్ర కిషోర్‌రెడ్డి, ఏజీఎం చెన్నకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి, మురళీమోహన్, వెంకటస్వామి, రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, సుమన్ అభినందించారు.

ఆశల చినుకులు

- నైరుతి ఆరంభంలోనే వర్షాలు
- అన్నదాత హర్షం
- సాగుకు సిద్ధమవుతున్న రైతన్న



రాజుపాలెం: ఆకాశం మేఘావృతమైన దృశ్యం



నీటితో కళకళలాడుతున్న రాజోలి ఆనకట్ట

అన్నదాతల చింత తీర్చుతూ వరుణుడు కరుణిస్తున్నాడు. వానాకాలం సాగు ఆరంభించదానికి ముందే ఆశల చినుకులు కురిపిస్తున్నాడు. నైరుతి రుతుపవనాలు ఆరంభంలోనే మంచి ఫలితాలిస్తున్నాయి. మృగశిరకార్తె ప్రారంభంలోనే సాగు పనులు ఊపందుకున్నాయి. రైతన్నలు పొలాలను సిద్ధం చేసుకుంటూనే.. మరోవైపు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే పనిలో బిజీగా ఉన్నారు.



పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

రాజుపాళెం : నూరుతి రుతుపవనాల వలన మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం వర్షం పడటంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పొలాలు సంపూర్తిగా పదునైనట్లు రైతులు తెలిపారు. ఉన్నట్లుండి ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు ఏర్పడటం, దబదబమని చినుకులు పడ్డాయి. ఆయా గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచింది. రోడ్డుకు ఇరువైపులా మురికి కాలువలు లేకపోవడంతో ఆనీరు ఎటూపోలేక వీధుల్లో అలాగే నిలిచింది.

బద్వేలులో వర్షం

అట్లూరు : బద్వేలులో కురిసిన వర్షానికి రోడ్లు జలమయమైయ్యాయి. బుధవారం మధ్యాహ్నం నుంచి ఓ గంటపాటు బద్వేలు పట్టణంలో వర్షం కురిసింది. అయితే ఈ వర్షానికి సిద్దవటం రోడ్డులోని పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచింది. దీంతో వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు తప్పలేదు.

సేవాశ్రమానికి చేయూత



సేవాశ్రమంలో వెంకటేశ్వర్లు దంపతులను సత్కరిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

కాశినాయన : మండలంలోని ఓబుళాపురం సమీపంలో సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమానికి ప్రకాశం జిల్లా కొమరోలు యోగా సెంటర్ సభ్యులు బుధవారం ఆశ్రమాన్ని సందర్శించి ఆర్థిక సహాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా యోగా గురువు, ఉపాధ్యాయుడు బి.జయరామయ్య మాట్లాడుతూ మానసిక ఆరోగ్యానికి యోగా ఎలాగో మానవ జీవితానికి సార్థకత చేకూరాలంటే సమాజ సేవ వల్లే సాధ్యమవుతుందన్నారు. అనాథల పట్ల ఆపద్బాంధవుల్లా సేవలందిస్తున్న వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకులు పి.రామకృష్ణారెడ్డి, రామతులసిలను ఆయన అభినందించారు. సమాజంలో మానవతా విలువలు కొరవడుతున్న తరుణంలో మంచానికే పరిమితమైన వారికి సైతం ఆప్తులై అండగా నిలవడం హర్షించదగ్గ విషయమన్నారు. మహోన్నతమైన సేవ చేస్తున్న వివేకానంద సేవాశ్రమానికి ప్రతిఒక్కరు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం యోగా సభ్యులందరూ కలిసి రూ.61,700లు విరాళంగా అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల పదవీ విరమణ చెందిన యోగా సభ్యుడు, ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు దంపతులను ఆశ్రమ నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో ఎం.కళావతి, ఎం.విజయలక్ష్మి, బి.పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఫాదర్ కంబ్లిష్ బహుముఖ సేవలు

కడప కల్చరల్: జిల్లాలో క్రైస్తవ పితామహుడిగా పేరుగాంచిన ఫాదర్ కంబ్లిష్ సేవలు అందించారని శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మడగలం ప్రసాద్ అన్నారు. ఫాదర్ కంబ్లిష్ 55వ వర్ధంతి సందర్భంగా బుధవారం మరియాపురంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాదర్ కంబ్లిష్ మరియాపురం నిర్మాతగా, పేద బడుగులకు విద్య, వసతి, ఉపాధి తదితర సేవలందించారన్నారు. కేథలిక్ క్రైస్తవ బీజాలు నాటిన వ్యక్తి అని, కథోలిక విశ్వాసులు ఆయనను మరువలేరని అన్నారు. రాయలసీమ లాంటి కరవు ప్రాంతంలో పేదలకు విద్య, వైద్యం, ఉపాధి అందించారన్నారు. కంబ్లిష్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ప్రజల ఆదరభిమానాలు పొందాలని సూచించారు.



నివాళులర్పిస్తున్న భక్తులు

చిన్నారుల సంరక్షణ అందరి బాధ్యత

జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి



చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి

బద్వేలు అర్బన్ : అనాథశరణాలయం నిర్వాహకులు చిన్నారుల సంరక్షణ అందరి బాధ్యత అని జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి పేర్కొన్నారు. స్థానిక సుమిత్రానగర్‌లోని షాలోమ్ అనాథశరణాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలబాలికల హక్కులకు భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై కఠినచర్యలు ఉంటాయన్నారు. ముఖ్యంగా బాలల అక్రమ రవాణా నిరోధానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. పిల్లలు కష్టపడి చదివి మంచి ప్రయోజకులుగా తయారు కావాలని కోరారు. అనంతరం గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి అవగాహన కల్పించారు. అలాగే చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో షాలోమ్ అనాథ శరణాలయం నిర్వాహకురాలు దేవసుధ తదితరులు పాల్గొన్నారు.

వేరుకుళ్లు తెగులు నివారించండి



దుగ్గన్నగారిపల్లె వద్ద పత్తిపంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త శశికళ, వ్యవసాయ అధికారులు

వేముల : వేసవి పంటగా సాగుచేసిన పత్తి పంటలో వేరుకుళ్లు తెగులును నివారించుకోవాలని కృషివిజ్ఞాన కేవీకే శాస్త్రవేత్త శశికళ తెలిపారు. మండలంలోని దుగ్గన్నగారిపల్లెలో సాగుచేసిన పత్తి పంటను వారు పరిశీలించి మాట్లాడారు. రుతుపవనాల ప్రభావంతో పత్తిపంటలో నీరు నిలవడం వలన వేరుకుళ్లు తెగులు ఆశించిందన్నారు. దీని నివారణకు కాపర్ యాక్సీ క్లోరైడ్ 1 లీటరు నీటికి 3 గ్రాములు కలిపి మొదలు తడిసేలా పిచికారీ చేయాలన్నారు. మెగ్నీషియం వంటి పోషక లోపాల నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ లీటరుకు 2 గ్రాములు, 13-0-45 మందును ఒక లీటరు నీటికి 10 గ్రాములు కలిపి వర్షం నిలిచిన తర్వాత పిచికారీ చేయాలన్నారు. అలాగే గులాబీరంగు పురుగు నివారణకు ముందు జాగ్రత్త చర్యగా పత్తిపంటలో ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలు అమర్చడం ద్వారా మగపురుగులను ఆకర్షించడం ద్వారా నివారించవచ్చన్నారు. గులాబీరంగు పురుగు ఉధృతిని గమనిస్తే మొదటిదశలో ఒక లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల వేపనూనెను లేదా ప్రొపెనోపాస్ ఒక లీటరు నీటికి 2 మి.లీ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పత్తి పంట చివరి దశలో 1, 2 సార్లు మాత్రమే సింథటిక్ థైరీ థ్రాయిడ్స్ మందులు అయిన సూపర్ మైత్రేన్ ఒక లీటరు నీటికి 1 మి.లీ, లేదా ఫ్లూ బెండమైడ్ ఒక ఎకరానికి 50 మి.లీ లేదా నోవాల్యురస్ ఒక ఎకరానికి 300 మీ.లీ కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డీపీడీ పద్మలత, ఎఫ్టీసీ ఏఓ శివశైలజ, వేముల ఏఓ చెన్నారెడ్డి, రైతులు రామలింగారెడ్డి, పుల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షలో అవకతవకలపై న్యాయ విచారణ జరపాలి



కడప అప్సర సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నీట్ పరీక్షల్లో అక్రమాలపై న్యాయ విచారణ జరపాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం.ఓబులేసు యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ నీట్ యూజీ-2024 ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ రావడం, దీనిలో ఏడుగురు హర్యానాకు చెందిన ఒకే ఎగ్జామ్ సెంటర్ వారు కావడం అనుమానాలకు దారి తీయడం వెనుక బీజేపీ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. హర్యానాలోని ఓ సెంటర్‌లో ఎగ్జామ్ రాసిన జాన్వి 179 ప్రశ్నలకు సమాధానం రాయగా, 163 కరెక్ట్ అయ్యాయి. ఆమెకు 636 మార్కులు రావాల్సి ఉన్నా.. 720/720 ఎలా వచ్చాయో తెలియదన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి న్యాయ విచారణ జరిపి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్లబాబు, పప్పుశెట్టి రెడ్డిసాయి, నాయకులు నవీన్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: నీట్ పరీక్ష ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. కడప నగరంలోని అప్సర సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 విద్యా సంవత్సరంలో మెడికల్ విద్య అభ్యసించేందుకు జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షా ఫలితాలను హడావుడిగా విడుదల చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు.

వైభవంగా ఎదురుకోల్లు ఉత్సవం



ఎదురుకోల్లు కార్యక్రమానికి స్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించిన దృశ్యం

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్య మఠం, కొండావధూత ఆశ్రమంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం జరగనున్న కల్యాణం సందర్భంగా బుధవారం రాత్రి ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల ఎదురుకోల్లు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, వేదపండితులు పెళ్లిపెద్దలుగా ఉండి ఎదురుకోల్లు తంతును శాస్త్రోక్తంగా జరిపించారు. ఉదయం ఆలయంలో చతుస్థానార్చన, మూలమూర్తిహోమం, ఉత్సవబలి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే స్వామివారికి పవిత్రజలాలతో గంగానయనం కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డివెంకటరామిరెడ్డి, దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి శివయ్య, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కల్యాణం : వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించి సాయంత్రం హనుమంత వాహనసేవ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు.

నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం



పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ భాస్కర్

దువ్వూరు : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు దువ్వూరు మండలంలో గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభమవుతాయని మండల విద్యాశాధికారి భాస్కర్ తెలిపారు. మండలంలో ప్రాథమిక పాఠశాలలు 41, అప్పర్ ప్రైమరీ పాఠశాలలు 7, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 8 ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరంలో ప్రైమరీ పాఠశాలల్లో 1,782 మంది విద్యార్థులు, అప్పర ప్రైమరీ పాఠశాలల్లో 1,015 మంది, హైస్కూళ్లలో 586 మంది విద్యార్థులు ఉండగా, మొత్తం పాఠశాలల్లో 3,387 మంది విద్యార్థులు చదివారని, ఈ ఏడాది ఆ సంఖ్య ఇంకా ఎక్కువ ఉండవచ్చని పేర్కొన్నారు. మండలంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన 12 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయని, గత ఏడాది ఆ పాఠశాలల్లో 1,850 మంది విద్యార్థులు చదివారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు బ్యాగ్‌లు, బెల్టు, నోట్ పుస్తకాలు వచ్చాయని, యూనిఫాం రావాల్సి ఉందని తెలిపారు. 1 నుంచి 5వ తరగతి, 7వ తరగతికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు అందాయని, 6, 8, 9, 10వ తరగతులకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉందని తెలియజేశారు. మండలంలోని ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ పాఠశాలల ఉన్నతికి తోడ్పడాలని కోరారు.

చెలరేగిన మంటలు



పెట్రోలు బంకు సమీపంలో చెలరేగిన మంటలు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని హెచ్‌పీ పెట్రోలు బంకు ఆవరణలో బుధవారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. అయితే సిబ్బంది వేగంగా స్పందించి మంటలను ఆర్పి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే ఇటీవల కురిసిన వర్షాలకు పెట్రోలు బంకులోని ట్యాంకర్లలోకి నీరు చేరడంతో పెట్రోలులో నీరు కలిసింది. వాహనాలకు పెట్రోలు పట్టే సమయంలో నీరు కూడా వస్తుండటంతో వాహనదారుల నుంచి ఫిర్యాదులు అందాయి. దీంతో బుధవారం మరమ్మతులు చేపట్టే పనిలో భాగంగా ట్యాంకర్లలోకి దిగిన నీటిని హ్యాండ్‌బోర్ ద్వారా తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. అలా తొలగించిన నీటిని పెట్రోలు బంకు పరిసరాల్లోని డ్రైనేజీ కాలువలో పారబోశారు. ఈ సమయంలో నీటితో పాటు కొంత మేర పెట్రోలు కూడా వచ్చింది. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గ్రహించక సిగరెట్ వేయడంతో వెంటనే మంటలు చెలరేగాయి. మంటలు క్రమేపీ పెట్రోలు బంకులోకి వ్యాపించడం ప్రారంభించాయి. వెంటనే అప్రమత్తమైన పెట్రోలు బంకు సిబ్బంది బంకులోని సీఓటూ యంత్రాలతో మంటలను అదుపు చేశారు. మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల ఉన్న దుకాణదారులు పరుగులు తీశారు. మంటలు పూర్తిగా అదుపులోకి రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

అగ్నిపూల సోయగం



ఎర్రగా విరగపూసిన అగ్నిపూలు

ఒక్కో రుతువులో ఒక్కోరకం పూలు ప్రకృతికి అద్భుత సోయగాన్ని ఇస్తాయి. ఆవిధంగా వర్షాకాలంలో కొంద సుంకేసుల (అగ్నిపూలు) చెట్లు ఎర్రని పూలతో నిండి ఇట్టే ఆకర్షించడమే కాదు, కొత్త ఉత్తేజాన్ని కూడా ఇస్తాయి. రాజుపాళెం మండలంలోని పలు గ్రామాల్లో విరగపూసిన అగ్నిపూల సోయగం.

– రాజుపాళెం



చెట్టుకు పూసిన ఎర్రని పూలు

రైతు సేవలో వ్యవసాయ వర్శిటీ

పులివెందుల టౌన్ : వ్యవసాయ యూనివర్శిటీ 60వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం స్థానిక ఏపీకార్ల్‌లోని ఆచార్య ఎన్జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ రెడ్డిశేఖర్ మాట్లాడుతూ రైతు సేవలో వర్శిటీ ద్వారా అధిక దిగుబడినిచ్చే వంగడాల ద్వారా రైతులు అధిక ఆదాయాన్ని పొందేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు వ్యక్తిత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల అధికారి డాక్టర్ విజయశంకర్‌బాబు, అకడమిక్ అధికారి డాక్టర్ హరిప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ రామలక్ష్మిదేవి, పరిపాలన అధికారిణి లీలావతి, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

జమ్మలమడుగు : వినియోగదారులకు మెరుగైన సేవలను అందించినప్పుడే ప్రజలు బ్యాంకుల్లో ఖాతాలను తెరుస్తారని పంజాబ్ నేషనల్ బ్యాంక్ డీజీఎం అభిజిత్ సిన్హా తెలిపారు. బుధవారం పట్టణంలోని తేరు రోడ్డులో 74వ శాఖ పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ దేశంలోనే రెండవ అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అన్నారు. ఈ బ్రాంచ్‌లలో వ్యవసాయ, బంగారంపై రుణాలను ఇవ్వడంతోపాటు ఇంటికి సంబంధించిన లోన్లను తక్కువ వడ్డీకే ఇస్తామన్నారు. వినియోగదారులకు డిపాజిట్ బ్యాంకింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సోమశేఖర్, రమణ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులతో పనులు చేయించడం నేరం



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై జరిగిన కార్యక్రమంలో న్యాయవాదులు, అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్: చిన్నారులతో దుకాణదారులు, ఇతర సంస్థల యాజమానులు పనులు చేయించడం చట్ట రీత్యా నేరంగా గుర్తించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్ తెలిపారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మాసాపేట పరిధిలోని ఆటో గ్యారేజ్, పెట్రోల్ బంకులు, దుకాణాలు ఇతర యజమానులను నిర్బంధిత కార్మికులరక్షణ, పునరావాసం అంశంపై బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ షాపులు, సంస్థల యాజమాన్యాలు వయస్సు ధృవీకరణ పత్రాలు తీసుకుని కార్మికులను నియమించుకోవాలన్నారు. అలాగే ఉచిత న్యాయ సహాయం అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, కార్మిక శాఖ అధికారులు మునిస్వామి, శ్రీనివాసులు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సుభాష్, ఎల్‌పీఓ సునీత, పారా లీగల్ వలంటీర్లు శ్రీనివాసులు, విష్ణు, పోలీసులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట విద్యార్థుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ వ్యాప్తంగా గుర్తింపు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీఎస్‌వైఎఫ్, టీఆర్ఎస్ఎఫ్, ఆర్ఎస్ఓ, ఆర్‌వీఎఫ్ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. కడపలోని ఇంటర్ ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘ నేతలు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తింపు లేని కళాశాలలను అరికట్టడంలో ఆర్ఐవోలు విఫలమయ్యారన్నారు. కార్పొరేట్ యాజమాన్యాలు ఎలాంటి అనుమతులు లేకుండానే హాస్టల్స్ నిర్వహిస్తున్నాయన్నారు. ఆర్ఐవోలకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవని ఆరోపించారు. అధికారులు స్పందించి రాయలసీమ వ్యాప్తంగా ఉన్న సంబంధిత కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, తెలుగు రాష్ట్ర విద్యార్థి సమైఖ్య రాష్ట్ర కార్యదర్శి ఇండ్ల జయరాజ్, రాయలసీమ విద్యార్థి ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ ఆర్‌వీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.